క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కిషోర్



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన కిషోర్‌కుమార్, కుటుంబ సభ్యులు

తిరుమలగిరి : తుంగతుర్తి మాజీ శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సమేతంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కిషోర్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కిషోర్‌కుమార్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అతని నివాస గృహంలో కలిశారు.

టీచర్లకు హాస్టల్ విధులు కేటాయించొద్దు

సూర్యాపేటటౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో టీచర్లకు, ప్రిన్సిపాల్స్‌కు హాస్టల్ విధులను కేటాయించొద్దని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీచర్లకు హాస్టల్ విధులను అప్పగించడం వల్ల సరిగా పాఠాలు బోధించలేకపోతున్నారని తెలిపారు. గురుకులాల్లోని హాస్టళ్లలో చిన్న చిన్న సమస్యలకే ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవంగా బతుకుతున్న టీచర్ల కుటుంబాలను ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేసి వీధిపాలు చేయకూడదని ఆయన కోరారు.

తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నూతనకల్లు : తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డిని మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో సంఘం అధ్యక్షుడు బూడిద మల్లయ్య, బడపల్లి శ్రీనివాస్, మొగ్గుల శ్రీరాములు, సాగర్, రవి, సైదులు, లింగయ్య, లింగస్వామి, ఉప్పలయ్య, యాదగిరి, పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేఖ

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన డ్రైవర్ వేముల లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో సోమవారం మృతుడి కుటుంబీకులను రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేముల పెదనర్సయ్య, వేముల రాంబాబు, విక్రం, గణేష్, ఉపేందర్, మద్ది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదత్త ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



లింగాల గ్రామంలో శ్రీదత్త ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని లింగాల గ్రామ శివారులోని శ్రీ దత్త కుటీర్‌లో నిర్వహించిన శ్రీదత్త జయంతి ఉత్సవాలు ముగిశాయి. సోమవారం పురోహితులు ఇరువంటి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో గ్రామంలో శ్రీ దత్త ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో కోలాటాలు, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. వేడుకల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వెయింగ్ మిషన్ బహూకరణ

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు ఆర్‌ఎంపీ డాక్టర్ తిప్పర్తి భిక్షం సోమవారం వెయింగ్ మిషన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతివారం వెయింగ్ మిషన్ ద్వారా తూకం చూసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈరుకు వేయింగ్ మిషన్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, మల్లిక, గ్రామస్తులు నందారపు రామచంద్రం, తిప్పర్తి అరుణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వెయింగ్ మిషన్ అందిస్తున్న దాత భిక్షం

గ్రామీణం.. సమస్యలతో సతమతం

- గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో పేరుకుపోతున్న సమస్యలు
- ప్రత్యేకాధికారులు ఉన్నప్పటికీ కొరవడిన పర్యవేక్షణ
- వీధుల్లో చెత్త.. అధ్వానంగా డ్రెయినేజీలు



వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో చేతిపంపు చుట్టూ చేరిన మురుగు నీరు



చివ్వెంల మండల కేంద్రంలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

చివ్వెంల : పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించి అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారాయి. సర్పంచ్‌లు తమ పదవుల నుంచి దిగిపోయాక గ్రామాల్లో పనులు సక్రమంగా జరుగడం లేదు. కొన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం నిర్వహణ అటకెక్కింది. వీధుల్లోని డ్రెయినేజీలు అధ్వానంగా మారి కంపుకొడుతున్నాయి. చెత్త ఎక్కడిక్కడ పేరుకుపోయి కనిపిస్తోంది. జీపీలకు ప్రత్యేకాధికారులుగా ఉన్నవారు సైతం పర్యవేక్షణ పూర్తిగా మరిచారు. దీంతో పల్లె ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. చివ్వెంల మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి జీపీ కార్యదర్శులతోపాటు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ ప్రస్తుతం అధికారులకు కుల గణన సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అప్పజెప్పడంతో వారంతా పంచాయతీ కార్యాలయాల్లో అడుగుపెట్టడం లేదు. దీంతో ప్రజలకు అందాల్సిన వివిధ రకాల సేవలు అందడం లేదు. ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంట్లు రాకపోవడంతో పనులు చేయలేక పోతున్నామని, కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందిగా మారిందని పలువురు పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు.

సీసీ డ్రెయినేజీలు లేవు..

మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ డ్రెయినేజీలు లేవు. ప్రధానంగా ఎస్సీ కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ అసలే కనిపించడం లేదు. బండరాళ్లతో నిర్మించిన డ్రెయినేజీలు చెత్తాచెదారంతో కూరుకుపోయాయి. దీంతో మురికి నీరు వెళ్లకుండా ఎక్కడిక్కడ నిలిచిపోతుంది. కొత్తగా సీసీ డ్రెయినేజీలు నిర్మించాలని గత సర్పంచ్‌లను కోరినా నిర్మించలేదు. ఇటు నిధులు వస్తే తప్ప తాము డ్రెయినేజీలు నిర్మించలేమని పంచాయతీ అధికారుల చెబుతున్నారు. కాలనీల్లో కూడా రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అన్ని గ్రామాలకు డ్రెయినేజీలు, సీసీరోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఎటు చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. చెత్త ఎక్కడిక్కడ పేరుకుపోతోంది. కుళాయిల వద్ద నీరు వృథాగా పోతోంది. అధికారులు ఇటు వైపు వచ్చి చూడటం లేదు. ఇకనైనా స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– కలకొండ రాంబాబు, వట్టిఖమ్మంపహాడ్

సమస్యలపై దృష్టిసారించాలి

గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పట్ల అధికారులు దృష్టిసారించాలి. మిషన్ భగీరథ పైపు లైన్లు పగిలి నీరు కలుషితం అవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇళ్ల మధ్యనే చెత్తా చెదారం పోస్తున్నారు. దీనివల్ల ఈగలు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలి.

– ఎండీ.రఫీ, చివ్వెంల

● కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష



సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్ష ఏడవ రోజుకు చేరింది. సూర్యాపేటలో కొనసాగుతున్న దీక్షలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సోమవారం చెవిలో పూలతో నిరసన వ్యక్తం చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు

తుంగతుర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభనను వెలికి తీయడానికి క్విజ్ పోటీలు ఎంతో దోహదపడుతాయని మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్ అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని డీఆర్‌ఆర్‌ఎం పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించాలన్నారు. ఈ క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి జెడ్పీహెచ్ఎస్ గొట్టిపర్తి, ద్వితీయ బహుమతి తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు, తృతీయ బహుమతి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల తుంగతుర్తి విద్యార్థులు గెల్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి బహుమతులను ప్రదానం చేశారు.



తుంగతుర్తిలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న మాజీ ఎంపీపీ కవిత

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, మాజీ సర్పంచ్ తునికి సాయిలు, నాయకులు గునగంటి సంతోష్, గోపగాని శ్రీనివాస్, నాగమల్లు, వెంకన్న, రవికుమార్, వెంకటేష్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల్

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక లెనిన్ నగర్‌లో ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ప్రారంభమై సంవత్సరం దాటినా విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన అన్నారు. విద్యారంగానికి కనీసం విద్యాశాఖ మంత్రిని కేటాయించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం విజయ్, వినయ్, మాతంగి విజయ్, వివేక్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తమ్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వానికి, యువతకు యువజన కాంగ్రెస్ నాయకులు వారధిగా పని చేయాలని అన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొమ్ము జోహార్, సూర్యాపేట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరుకొప్పుల నరేష్‌గౌడ్, రామడుగు నవీన్, పెద్దబోయిన అజయ్, కోడి కుమార్, పసుల అశోక్, ఎల్లేష్, షేక్ వలీ, వెంకటేష్, హరీష్, సాయి, విష్ణు, వంశీ, శ్రీకాంత్, నవీన్, పాష తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



ఆత్మకూర్ (ఎస్) : అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

తుంగతుర్తి : మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ సబ్ కమిటీకి వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు యాకునాయక్, వెంకన్న ఉన్నారు.

మద్దిరాల : సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ కమిటీని కలిసేందుకు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లావుడ్యా వెంకన్న మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బర్పటి ఉపేందర్, వెలుగు వెంకన్న, వల్లపు యాకయ్య పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుండా అరెస్టులా..

ఆత్మకూర్(ఎస్) : పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అసెంబ్లీ సబ్ కమిటీకి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం అక్రమమని మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం పోలీసులు అరెస్టు చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు గూగుల్ లింగ నాయక్, సానబోయిన రజితసుధాకర్, శ్రీను తదితరులు ఉన్నారు.

చివ్వెంల : గ్రామాల అభివృద్ధికి తాము చేసిన పనుల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ కమిటీకి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తున్న పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు సోమవారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్ రెడ్డి, ధరావతు భిక్షం నాయక్, ధరావతు భద్రు నాయక్, కంచర్ల గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కిషోర్ జన్మదిన వేడుకలు



తుంగతుర్తిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిరుమలగిరి : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, దూపటి రవీందర్, యాకూబ్‌నాయక్, కందుకూరి బాబు, నరోత్తమ్‌రెడ్డి, ఆకుల వీరయ్య, రామ్మూర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మాజీ ఎమ్మెల్యే కిషోర్ జన్మదినం సందర్భంగా అర్వపల్లి దేవాలయంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక వైజంక్షన్‌లో కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, కడారి నరేష్, ఎం.రాజలింగం, ఎల్లంరాజు, ప్రభు, కిరణ్, వెంకన్న, మల్లయ్య, కరుణాకర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములు, తునికి సాయిలు, దొంగరి శ్రీను, దుర్గయ్య, దాసు, శ్రీనివాస్, చంద్రయ్య, ఈరోజీ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య గౌడ్, దోమల బాలమల్లు, యారాల నర్సింహారెడ్డి, ఈదుల కిరణ్, యారాల రాంరెడ్డి, చిప్పలపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్లు : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చూడి లింగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పుల వీరుయాదవ్, మూరగుండ్ల సైదులు, మొగుళ్ల వెంకన్న, గడ్డం యాదగిరి, బయ్యా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దుగ్యాల రవీందర్‌రావు, కోడి శ్రీనివాస్, జిలకర్ర చంద్రమౌళి, వద్దాణం మధుసూదన్, మల్లు కళింగారెడ్డి, పాతూరి లింగారెడ్డి, దామెర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



సూర్యాపేట : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వైభవాన్ని తెలియజేస్తున్న అర్చకుడు



సూర్యాపేట : పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాస వేడుకలు ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారికి మంగళ నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ధనుర్మాస వైభవాన్ని భక్తులకు తెలిపారు. ఈ మార్గశిర మాసంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని కొలిసిన వారికి తమ కోరికలు నెరవేరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆండాళ్ గోష్ఠి భక్తబృందం, వికాస తరంగిణి మహిళా భక్తులు, గోవింద మాల భక్త బృందం, ప్రజలు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు విశేష పూజలు నిర్వహించారు. అలాగే 30పాశురాలను పఠించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గుడిపల్లి సులోచన, పున్న హరిప్రసాద్, శిగ రవి, పెద్ది నారాయణ, శిగ శ్రీను, సదాలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



సూర్యాపేట : గోవిందమాల ధరిస్తున్న భక్తులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు..



సూర్యాపేట : ధనుర్మాస ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



సూర్యాపేట : మంగళహారతులు ఇస్తున్న భక్తులు

14 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏపీఎం మల్లేష్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో యాసంగి సీజన్‌కు గాను 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 14 కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తయ్యాయని ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ తెలిపారు. సోమవారం అర్వపల్లి ఐకేపీ సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. అర్వపల్లి సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు సుమారు 7వేల క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. అలాగే మండల వ్యాప్తంగా 14 ఐకేపీ కేంద్రాల ద్వారా సుమారు లక్ష క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జ్ లింగంపల్లి ఈశ్వరి, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

● జీవన భృతి కోసం వృద్ధురాలి ఆక్రందన

భానుపురి : నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన జలగం సొక్కు బాయమ్మ తన కుమారుల నుంచి జీవన భృతి ఇప్పించాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించింది. 2011లో తన భర్త చనిపోవడంతో చిన్న కుమారుడు వెంకటరమణ సూర్యాపేటకు తీసుకెళ్లి 10 ఏళ్ల పాటు తన పిల్లలకు సేవ చేయించుకున్నాడని తెలిపింది. తర్వాత ఎర్రపహాడ్ గ్రామంలో చిన్న రేకుల ఇల్లు కట్టించగా.. పెద్దకుమారుడు సీతారాములు దాన్ని ఆక్రమించి బయటకు పంపించినట్లు ఫిర్యాదులో పేర్కొంది.



వినతిపత్రంతో వృద్ధురాలు

కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగుల నిరసన



కస్తూరిబా పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాన్ టీచింగ్ ఉద్యోగులు

చివ్వెంల : కస్తూరిబా పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల ఎదుట నాన్ టీచింగ్ ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి పర్మినెంట్ చేయాలని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కస్తూరిబా పాఠశాలలో ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసి సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న సిబ్బందిపై పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సిబ్బంది లోలిత, లక్ష్మి, లలిత, లాలీ, మహేశ్వరి, భద్రమ్మ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ పరిస్థితి విషమం

నడిగూడెం : దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ పరిస్థితి విషమంగా ఉంది. నడిగూడెం మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన లేళ్ల కేతమ్మ ఈ నెల 6న తన వ్యవసాయ భూమి వద్ద పని చేసుకుంటుండగా పక్క పొలానికి చెందిన లేళ్ల వెంకన్న గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అదే రోజు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నడిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని సోమవారం కుటుంబసభ్యులు తెలిపారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని వినతి

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో బాబూ జగ్జీవన్‌రామ్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీని కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్ డేలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌కు ఏజెన్సీ ప్రెసిడెంట్ మల్లయ్య వినతిపత్రం అందించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అందుబాటులో ఎరువులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని పీఏసీఎస్‌లో రైతులకు వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. డీఏపీ 400 బస్తాలు, 20-20-0-13 రకం ఎరువులు 200బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు తీసుకెళ్లాలని కోరారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మునగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా యాసంగి పంటలు –సస్యరక్షణ చర్యలు అనే అంశంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి పరిశీలించారు. కొమ్మాల, కోమటిపల్లి, నాన్యతండా, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఏలు నాగమణి, దీపిక తదితరులు పాల్గొన్నారు.